క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా బంద్

అడ్డాకుల: మూసాపేట మండలంలో ఆదివారం కూడా విద్యుత్ సరఫరాను నిలిపి వేయనున్నట్లు సిబ్బంది తెలిపారు. పొల్కొండ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద మరమ్మతు పనులు చేయనున్నందున ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎమ్మెల్యే పర్యటన..

దేవరకద్ర: జీనుగరాలలో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవన ప్రారంభోత్సవం కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొంటారని ఆయన క్యాంపు కార్యాలయం నుంచి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అనంతరం నియోజకవర్గ కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో దేవరకద్ర, చిన్నచింతకుంట మండలాలకు సంబంధించి బూత్ కమిటీ ఇన్‌చార్జ్‌ల సమావేశంలో పాల్గొంటారని వివరించారు. జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి సైతం రానున్నట్లు తెలిపారు.

గొర్రెలను పంపిణీ చేయాలని వినతి

మహమ్మదాబాద్: చిన్నాయపల్లి గొల్లకురుమలు, బీఆర్‌ఎస్ నాయకులు శనివారం పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డిని కలిశారు. తమ గ్రామంలో రెండో విడత గొర్రెలను పంపిణీ చేయాలని, ఎంతో మంది వాటిపైనే ఆధారపడి జీవిస్తున్నారని వివరించారు. గ్రామంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టాలని కోరారు. ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు.

14న ఆత్మీయ సమ్మేళనం

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం మోనప్ప గుట్టలోని మౌనేశ్వరస్వామి దేవాలయం ప్రాంగణంలో ఈనెల 14న స్వర్ణకారుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నారు. ఈ మేరకు వివరాలను శ్రీవిరాట్ విశ్వకర్మ జిల్లా స్వర్ణకార సంఘం అధ్యక్షుడు గుండుమాల్ చంద్రశేఖరాచారి, పట్టణ అధ్యక్షుడు రామాచారి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని వివరించారు.

డ్రెయినేజీ నిర్మాణానికి భూమిపూజ



జడ్చర్ల టౌన్: కావేరమ్మపేటలో నిర్మించిన డబుల్‌బెడ్‌రూంల వద్ద అండర్‌డ్రెయినేజీ నిర్మాణం కోసం మున్సిపల్‌చైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మి శనివారం భూమిపూజ చేశారు. ఇళ్లు త్వరలో పంపిణీ చేయనున్న నేపథ్యంలో పనులు చేపట్టినట్లు వివరించారు. కౌన్సిలర్లు బుక్క మహేష్, జ్యోతి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రేపు కాంగ్రెస్ సమావేశం

మహమ్మదాబాద్: నంచర్లలో సోమవారం మండల కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు కేఎం నారాయణ తెలిపారు. మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి నాయకులు హాజరవుతారని వివరించారు. నాయకులు తప్పకుండా రావాలని సూచించారు.

పంచ ప్రాణాల ప్రతిజ్ఞ



అడ్డాకుల: మూసాపేట మండలంలోని సంకలమద్ది శివారులో ఉన్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో శనివారం బీజేపీ నాయకులు పంచప్రాణాల ప్రతిజ్ఞ చేయించారు. స్వతంత్ర అమృత్ మహోత్సవాల్లో భాగంగా స్థానిక బీజేపీ నాయకులు కార్యక్రమం చేపట్టారు. మండలాధ్యక్షుడు రవీందర్‌గౌడ్, కొండారెడ్డి, రవిరాజాచారి, గోవర్ధన్‌రెడ్డి, ప్రవీణ్, నర్సిములుగౌడ్, బాలచంద్రుడు తదితరులు ఉన్నారు.

‘మంత్రిపై ఆరోపణలు తగవు’



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌పై కాంగ్రెస్ నాయకులు చేసిన ఆరోపణలను బీఆర్‌ఎస్ నాయకులు తిప్పికొట్టారు. శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆరోపణలు తగవన్నారు. దొంగే దొంగా అన్నట్లుగా కాంగ్రెస్ నాయకుల తీరు ఉందన్నారు. కేసు బుక్ చేసినంత మాత్రాన తప్పు చేసినట్లు కాదని అన్నారు. కాంగ్రెస్‌లోని ప్రధాన నాయకులపై ఎన్నో కేసులు కొనసాగుతున్నాయన్నారు. అక్రమ మార్గంలో భూములు పట్టా చేసుకున్న వారు కూడా మంత్రిపై ఆరోపణలు చేయడం విడ్డూరమన్నారు. ఎఫ్‌ఐఆర్ నమోదైనందున మంత్రి జాతీయ జెండా ఎగరవేయకూడదు అని మాట్లాడడం వారి అవివేకానికి నిదర్శనమన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని అన్నారు. జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, మార్కెట్ కమిటీ చైర్మన్ రెహమాన్, బీఆర్‌ఎస్‌కేవీ జిల్లా అధ్యక్షుడు కష్ణమోహన్, డీసీసీబీ చైర్మన్ కే వెంకటయ్య పాల్గొన్నారు.

ఉప్పునీరే గతి

- 4–5రోజులకు మిషన్ భగీరథ నుంచి తాగునీరు
- చాలా చోట్ల సీసీరోడ్లు ధ్వంసం
- సగం వరకు మట్టి రోడ్లే శరణ్యం

26వ వార్డులో జనాభా: 6394
ప్రధాన వీధులు: హబీబ్‌నగర్, హనుమాన్‌పుర (కొంత భాగం), అక్బర్ మసీదు వెనుక ప్రాంతం

వార్డ్ వాచ్



రాయచూర్ మెయిన్ రోడ్డు నుంచి హబీబ్‌నగర్‌లోకి వెళ్లే మార్గంలో ధ్వంసమైన సీసీ రోడ్డు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక 26వ వార్డు పరిధిలో సమస్యలు తిష్ట వేశాయి. సింహ భాగం హబీబ్‌నగర్‌లో ఉండగా చాలా వరకు సీసీరోడ్లు దెబ్బతిన్నాయి. సగం వరకు మట్టి రోడ్లే శరణ్యమయ్యాయి. పాత డ్రెయినేజీలు కావడంతో మురుగు ముందుకు వెళ్లే పరిస్థితి కనిపించడం లేదు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో లోతట్టు ప్రాంతంలో ఎక్కడికక్కడ నీరు రోడ్లపై పారుతోంది. నాలుగైదు పవర్ బోర్ల ద్వారా వాడుకోవడానికి ఉప్పునీరు రోజూ సరఫరా అవుతున్నాయి. మూడు నాలుగు రోజులకొకసారి మాత్రమే మిషన్ భగీరథ నీరు అందుతోందని స్థానికులు వాపోతున్నారు. ఓపెన్ ప్లాట్లలో చుట్టుపక్కల వారు చెత్తాచెదారం వేయడంతో డంపింగ్ యార్డుల్లా తయారయ్యాయి. అక్బర్ మసీదు వెనుక ప్రాంతంలో మట్టి రోడ్లే దిక్కయ్యాయి. సీసీ రోడ్లతో పాటు పాత డ్రెయినేజీల స్థానంలో కొత్తవి నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. హనుమాన్‌పుర–గిర్నీగడ్డ ప్రాంతంలో అసలే చిన్న గల్లీలు.. ఆపై పాత ఇళ్లలోనే నివాసం ఉంటున్నారు. లోపలికి పెద్ద వాహనాలు వెళ్లే పరిస్థితి లేదు. పాత డ్రెయినేజీల నుంచి దుర్గంధం వెదజల్లుతోంది. కుక్కల బెడద తీవ్రంగా ఉందని ఇక్కడి ప్రజలు ఆరోపిస్తున్నారు. పాత విద్యుత్ స్తంభాలను మార్చాలని కోరుతున్నారు.



అక్బర్ మసీదు వెనుక ప్రాంతంలోని ఓ గల్లీలో మట్టిరోడ్డే శరణ్యం

సీసీరోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలి..



మా వీధిలో అన్నీ మట్టిరోడ్లే ఉన్నాయి. పాత డ్రెయినేజీలు మురుగుతో నిండిపోయాయి. ఆపై చెత్తాచెదారం వేయడంతో దోమలు విపరీతంగా పెరిగిపోయాయి. చిన్నపిల్లలను బయటకు ఆడుకోవడానికి పంపిస్తే డెంగీ సోకుతుందని ఆందోళనగా ఉంది. ఎప్పటికప్పుడు చెత్త తొలగిస్తే బాగుంటుంది.

– మహ్మద్ ఇసాక్, అక్బర్ మసీదు వెనుక ప్రాంతం

నిత్యం ఉప్పునీరే

నిత్యం పవర్ బోర్ల ద్వారా ఇళ్లలోని కొళాయిలకు ఉప్పునీరే వదులుతున్నారు. ఇవి కేవలం వాడుకోవడానికే ఉపయోగపడుతున్నాయి. కొత్త పైపులైన్ వేసి మిషన్ భగీరథ పథకం ద్వారా రోజు విడిచి రోజూ తాగునీరు సరఫరా చేయాలి. అక్బర్ మసీదు చౌరస్తాలో డ్రెయినేజీల నుంచి దుర్గంధం వస్తుంది. వీధిదీపాలు 24 గంటలూ వెలుగుతున్నాయి. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించాలి.

– షౌకత్, హబీబ్‌నగర్ ప్రాంతవాసి

సమస్యలు పరిష్కరిస్తాం

ఆయా వీధుల్లో నెలకొన్న సమస్యలను వీలైనంత వరకు పరిష్కరిస్తాం. మూడున్నరేళ్ల కాలంలో సుమారు రూ.75 లక్షలతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టాం. ఇటీవల రూ.కోటి పైచీలుకు నిధులు కావాలని మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు విజ్ఞప్తి చేశాం. రూ.70 లక్షలు మాత్రమే మంజూరయ్యాయి. ఇంకా రూ.75 లక్షలు కేటాయిస్తేనే మిగిలిపోయిన పనులన్నీ పూర్తవుతాయి.

– ముస్కాన్ సుల్తానా, 26వ వార్డు కౌన్సిలర్

‘భగీరథ’ పైపులైన్‌కు మరమ్మతు

సాక్షి ఎఫెక్ట్..

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక పదోవార్డు పరిధిలోని విఘ్నేశ్వరకాలనీలో పగిలిన మిషన్ భగీరథ పైపులైన్‌కు ఎట్టకేలకు మున్సిపల్ అధికారులు మరమ్మతు చేయించారు. మర్లులో ఐదురోజుల క్రితం పైపులైన్ పగిలిపోవడంతో మట్టిరోడ్డుపైకి తాగునీరు వచ్చి వృథాగా ఏరులై పారింది. దీంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇదే విషయమై ‘సాక్షి’లో ఈనెల 12న ‘పగిలిన మిషన్ భగీరథ పైపులైన్’ శీర్షికన కథనం ప్రచురితమైన విషయం విదితమే. దీనికి స్పందించిన మున్సిపల్ అధికారులు వెంటనే బాగు చేయించారు. దీంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.



పైపులైన్‌కు మరమ్మతు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

కాంగ్రెస్ మైనార్టీ విభాగంలో నియామకాలు



మైనార్టీ విభాగంలో నియమితులైన వారితో నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: కాంగ్రెస్ మైనార్టీ విభాగంలో పలువురిని వివిధ పదవుల్లో శనివారం నియమించారు. జిల్లా కార్యాలయంలో కార్యక్రమం నిర్వహించారు. మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శులుగా మహ్మద్ హఫీజ్, మహ్మద్ అక్బార్ హుస్సేన్, యహియ బిన్ సయీద్, కార్యదర్శులుగా మహ్మద్ జుబేర్, అన్వర్‌ఖాన్, మహ్మద్ ఒవేజ్‌లకు నియామకపత్రాలు అందజేశారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు సంజీవ్ ముదిరాజ్, ఎస్.వినోద్ కుమార్, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు మహ్మద్ ఫయాజ్, సిరాజ్ ఖాద్రీ, లక్ష్మణ్‌యాదవ్, రాములుయాదవ్, పీర్ సాధిక్ పాల్గొన్నారు.

జిల్లా ఎస్సీసెల్‌లో పదవులు..

కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా కె.శంకర్, పట్టణ ఎస్సీసెల్ ఉపాధ్యక్షులుగా చిన్నదర్పల్లి ఆంజనేయులు, శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా ఎల్లయ్యలకు నియామక పత్రాలు అందజేశారు. ఎస్సీసెల్ అధ్యక్షుడు సాయిబాబా, ఇతర నాయకులు పాల్గొన్నారు.

‘శ్రీనివాస్‌గౌడ్‌ను బర్తరఫ్ చేయాలి’

స్టేషన్ మహబూబ్‌నగర్: నేరారోపణలు ఎదుర్కొంటున్న శ్రీనివాస్‌గౌడ్‌ను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.వినోద్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మంత్రికి జాతీయ జెండా ఆవిష్కరించే అవకాశం ఇవ్వకూడదన్నారు. అరాచక పాలన నుంచి ప్రజలకు విముక్తి కలిగే వరకు తమ పోరాటం ఆగదని అన్నారు. ఉపాధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వసంత, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అమరేందర్‌రాజు, నాయకులు చంద్రశేఖర్, ఫహీం, జహీర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారమే ధ్యేయం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: విద్యారంగ సమస్యల పరిష్కారమే తమ ధ్యేయమని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సి.రాజు అన్నారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో శనివారం ఏఐఎస్‌ఎఫ్ 88వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్వేత అరుణ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోకి విద్యార్థి సంఘాలను, మీడియాను అనుమతించవద్దని ఆదేశాలు జారీ చేయడం తగదన్నారు. ప్రభుత్వ విద్య పరిరక్షణకు, కొత్త జాతీయ విద్యా విధానానికి వ్యతిరేకంగా సమరశీల పోరాటాలు చేస్తామన్నారు. విద్యార్థి ఉద్యమాలను అణచివేయాలని చూస్తే అంతకు రెట్టింపు వేగంతో ముందుకు కదులుతామన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకుడు బి.పరమేష్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు శేఖర్, నాయకులు సురేష్, రాజేష్, నాగేంద్ర, శంకర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

‘శాస్త్రీయ విద్య కోసం పోరాటం’..

శాస్త్రీయ విద్య కోసం పోరాటం చేస్తామని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పవన్‌కుమార్‌రెడ్డి అన్నారు. సంఘం 88వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం పాలమూరు యూనివర్సిటీ ప్రధాన గేటు వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెక్యులరిజం, ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. సమరశీల విద్యార్థి ఉద్యమాల నిర్మాణంలో ముందుంటామన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు భూమయ్య, రవికుమార్, జేపీసీ నాయకుడు బత్తిని రాము, ఎంఎస్‌ఎఫ్ నాయకులు గణేష్, నరేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణచౌరస్తాలో సంఘం ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

పుస్తకాల ఆవిష్కరణకు తరలిరండి

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకు చెందిన ప్రముఖ కవి ఎండి.ఖాజామైనద్దీన్ రచించిన ‘మండుతున్న సూర్యులు’, ‘కలాలు సజీవమే’ పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలోని జలజం జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు తెలంగాణ సాహితీ జిల్లాశాఖ ప్రతినిధులు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్య అతిథులుగా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్ రెడ్డి, ప్రముఖ కవి డాక్టర్ సుంకిరెడ్డి నారాయణరెడ్డి, గంటా మనోహర్‌రెడ్డి తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు. జిల్లాలోని కవులు, సాహితీ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఉర్సు ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



జడ్చర్ల: స్థానిక హౌసింగ్‌బోర్డు కాలనీ సమీపంలో గల సయ్యద్ మొహబ్బత్ అలీషా సాహెబ్ ఖాద్రీ దర్గా ఉర్సు ఉత్సవాలల్లో శనివారం ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. దర్గా వద్ద ఆయన ప్రత్యేక ప్రార్థనలు చేసిన అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. జడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి, పాల్గొన్నారు.

సూరారంలో కొడి పీర్ల ఉత్సవాలు



కొడి పీర్లను ఊరేగిస్తున్న నిర్వాహకులు

కోయిల్‌కొండ: సూరారంలో కొడి పీర్ల ఉత్సవాలను నిర్వాహకులు వైభవంగా నిర్వహించారు. గ్రామంలో ముందుగా వీధుల గుండా కొడి పీర్లను ఊరేగించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రతి సంవత్సరం గ్రామంలో ఉత్సవాలు ఘనంగా నిర్వాహిస్తామని సర్పంచ్ కరుణాకర్‌రెడ్డి తెలిపారు.

విద్యారంగంపై నిర్లక్ష్యం తగదు : టీఎస్‌యూటీఎఫ్



ధర్నాలో పాల్గొన్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ప్రభుత్వ విద్యారంగాన్ని కేంద్రం, రాష్ట్రాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.వెంకటేష్, కె.రవికుమార్ ఆరోపించారు. శనివారం ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో టీటీడీ కల్యాణ మండపం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త పెన్షన్ విధానం, ఉమ్మడి జాబితాలోని విద్యను కబ్జా చేస్తోందని విమర్శించారు. భవిష్యత్‌లో శాస్త్రీయ విద్యా విధానం ఎండమావేనని పేర్కొన్నారు. ఇక ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులపై రాష్ట్ర ప్రభుత్వం తాత్సారం చేస్తూ కోర్టుల చుట్టూ తిరిగే పరిస్థితి కల్పించిందన్నారు. కొత్త నియామకాలు లేవని, పీఆర్‌సీ కమిటీ వేసి ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆదాయపు పన్ను పరిమితిని రూ.8 లక్షలకు పెంచాలని, డీఎస్సీ–2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆదిత్య, ఎస్.వెంకటేశ్వర్లు, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహమూద్, నవీన్, ఆయా సంఘాల నాయకులు ఎస్.కిష్టయ్య, శ్రీశైలం, పి.ఉమాదేవి, భాస్కర్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి పర్యావరణ అనుమతులు లభించినందుకు శనివారం పాలమూరు యూనివర్సిటీ ఆవరణలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి బీఆర్‌ఎస్‌వీ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సంఘం పీయూ కన్వీనర్ గడ్డ భరత్‌బాబు మాట్లాడుతూ రాష్ట్రం సస్యశ్యామలం కావడాన్ని ఓర్వలేని కొందరు నాయకులు ఈ ఎత్తిపోతలపై కేసులు వేశారని ఆరోపించారు. వీటిని ఎదుర్కొని, మరెన్నో అడ్డంకులను అధిగమించి అన్ని అనుమతులు సాధించడానికి సీఎం ఎంతో కృషి చేశారన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాను పచ్చగా చూడాలన్నది కేసీఆర్ అభిమతమని పేర్కొన్నారు. తాయప్ప, తిరుమలేష్‌నాయుడు, ఆంజనేయులు, అంజప్ప పాల్గొన్నారు.

గుంతలమయంగా బీటీరోడ్డు



బీటీరోడ్డుపై ఏర్పడిన గుంతలు

అడ్డాకుల: మండలంలోని రాచాల గ్రామానికి వెళ్లే బీటీరోడ్డు గుంతలమయంగా మారింది. రోడ్డు వేసిన రెండు నెలల లోపే పాడవటంతో గ్రామస్తులు శనివారం ఆందోళన వ్యక్తం చేశారు. పొన్నకల్ చెరువు కట్ట నుంచి రాచాల వరకు సుమారు 4.3కిలోమీటర్ల దూరం బీటీరోడ్డు రెన్యూవల్ కోసం పంచాయతీరాజ్ శాఖ ద్వారా ఎంఆర్ఆర్ కింద రూ.2.40కోట్లు మంజూరు కావడంతో జూన్ చివరి వారంలో రోడ్డు పనులను పూర్తి చేశారు. ఇంతలోనే రోడ్డుపై పగుళ్లు ఏర్పడ్డాయి. ఇటీవల కాంట్రాక్టర్ ఆనంద్‌రెడ్డి రోడ్డు గుంతలను పూడ్చి వేయించారు. తాజాగా చాలాచోట్ల రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడటంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలలు కూడా పూర్తి కాకుండానే రోడ్డు పాడవటంపై నిరసన వ్యక్తం చేస్తున్నారు. నాసిరకంగా పనులు చేయించిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని, కలెక్టర్, క్వాలిటీ కంట్రోల్ అధికారులకు ఫిర్యాదు చేస్తామని అన్నారు. పంచాయతీరాజ్ ఏఈ వేణుగోపాల్‌రెడ్డిని వివరణ కోరగా రోడ్డుపై ఏర్పడిన పగుళ్లను ఇప్పటికే ఓసారి బాగు చేయించినట్లు తెలిపారు. ఇప్పుడు మరోసారి రోడ్డుపై గుంతలు ఏర్పడగా శనివారమే పరిశీలించినట్లు వివరించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

జడ్చర్ల: తుమ్మలకుంటతండాకు చెందిన పలువురు శనివారం ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. నాయకులు వీరేష్, రవి, ఆంజనేయులు, రాములు, తదితరులు పాల్గొన్నారు.

సహాయనిధి చెక్కు పంపిణీ

రాజాపూర్: ముదిరెడ్డిపల్లికి చెందిన శేఖర్‌కు సీఎం సహాయనిధి రూ. మూడు లక్షలు మంజూరయ్యాయి. సంబంధిత చెక్కును శనివారం ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఆయనకు అందజేశారు. ఉపసర్పంచ్ వెంకటయ్యగౌడ్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా గిరిజన నాయకులు లక్ష్మణ్‌నాయక్ తదితరులు ఉన్నారు.

ప్రశ్నించే గొంతులను అణచివేసేందుకు కుట్ర

మహబూబ్‌నగర్ న్యూటౌన్/ మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: యువత, నిరుద్యోగుల భవిష్యత్‌పై మాట్లాడే గొంతులను నొక్కేస్తున్నారని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రుక్మొద్దీన్ ఆరోపించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ గృహ నిర్బంధంపై శనివారం జిల్లా కేంద్రంలో పార్టీ ఆధ్వర్యంలో నిరసనదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రూప్–2 పరీక్షలు వాయిదా వేయకుంటే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. కోర్టు ఆదేశాల మేరకు మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌పై తగు చర్యలు తీసుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం వెనకేసుకొస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్‌లు తోకల కృష్ణ, ధార రాంచందర్, దేవరకద్ర నియోజకవర్గ ఇన్‌చార్జ్ సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో నిరసన వ్యక్తం చేస్తున్న బీఎస్పీ నాయకులు

చన్మన్‌పల్లికి రావాలని కేటీఆర్‌కు లేఖ

కోయిల్‌కొండ: బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో రాష్ట్ర ప్రజలు అనేక రకాలుగా లబ్ధిపొందుతున్నారని చన్మన్‌పల్లి గ్రామస్తులు అన్నారు. అలా లబ్ధిపొందిన వారిలో తమగ్రామం ఉన్నందుకు సంతోషిస్తున్నామని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే గ్రామానికి రావాలని మంత్రి కేటీఆర్‌ను ఆహ్వానించ దలుచుకున్నామని వివరించారు. ఈ మేరకు శనివారం ఆయనకు లేఖలు రాశామని పేర్కొన్నారు.



లేఖలు చూపిస్తున్న గ్రామస్తులు

ఎర్రసత్యం ఆశయ సాధనకు కృషి



నవాబుపేటలో ఎర్రసత్యం విగ్రహానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

నవాబుపేట: మాజీ ఎమ్మెల్యే ఎర్రసత్యం ఆశయసాధనకు కృషి చేస్తామని మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఎర్రసత్యం వర్ధంతి నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రంగారావు, సర్పంచ్ గోపాల్‌గౌడ్, మత్స్యశాఖ కార్యదర్శి రాజేష్, మాజీ సర్పంచ్ చంద్రశేఖర్, బంగ్లారవి, ఖాజా, మల్లేష్, లక్ష్మయ్య ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: పట్టణంలో మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ (యం.చంద్రశేఖర్) ఆధ్వర్యంలో ఎర్రసత్యం చిత్రపటానికి నివాళులు అర్పించారు. అడ్డాకూలీలకు అన్నదానం చేశారు.

మహబూబ్‌నగర్ న్యూటౌన్: మాజీ ఎమ్మెల్యే ఎర్రసత్యం వర్ధంతిని పురస్కరించుకొని పట్టణంలోని పలు కూడళ్ల వద్ద ఆయన చిత్రపటాలను ఏర్పాటు చేశారు. ఎర్రసత్యం చౌరస్తాలోని ఆయన విగ్రహానికి మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ మంత్రి చంద్రశేఖర్, జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్, కాంగ్రెస్ నాయకులు ఒబేదుల్లా కొత్వాల్, పీసీసీ ప్రధానకార్యదర్శి సంజీవ్ ముదిరాజ్ తో పాటు ఆయా పార్టీల నాయకులు తదితరులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. దర్పల్లి హరికృష్ణ, నిరంజన్, రాజేశ్‌లు ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్ రాంకిషన్‌తో కలిసి రోగులకు పండ్ల పంపిణీ, అన్నదానం చేశారు.

హన్వాడ: మండలంలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఎంపీపీ బాల్‌రాజు, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు ఖాసీం, సింగిల్‌విండో చైర్మన్ వెంకటయ్య, కళాకారుల సంఘం అధ్యక్షుడు కిరణ్, ముదిరాజ్ జేఏసీ నాయకులు పల్లెమోని యాదయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.